క్లుప్తంగా

అర్జీలకు సత్వర పరిష్కారం



పొన్నూరు: ప్రజల నుంచి వివిధ సమస్యలపై తీసుకునే అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని డిప్యూటీ తహసీల్దార్ ఎ.మాధవి అన్నారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి 11 అర్జీలను స్వీకరించారు. వాటిలో రెవెన్యూ 7, డీఆర్‌డీఏ 2, సర్వేకు సంబంధించి 2 అర్జీలు అందాయని, వాటిని వెంటనే పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ మల్లికార్జునరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తురకపాలెంలో ఎమ్మెల్యే రాత్రి బస

గుంటూరు రూరల్: తురకపాలెం గ్రామంలో కొంత కాలంగా వరుస మరణాలు సంభవిస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు సోమవారం రాత్రి గ్రామంలో బస చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలో నెలకొన్న అపోహలను తొలగించటానికి ఆయన స్వయంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఎమ్మెల్యే బస చేసేందుకు అధికారులు బెడ్లు, ఏసీలు ఇతర సౌకర్యాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టెంట్‌లో అందుబాటులో ఉంచారు. గత వారం రోజులుగా గ్రామంలో ఎటువంటి మరణాలు సంభవించ లేదని ప్రజలు ధైర్యంగా ఉండవచ్చని ఎమ్మెల్యే తెలిపారు.

ఆత్మహత్యల నివారణపై అవగాహన



పెదకాకాని(ఏఎన్‌యూ): యువత మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని వర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఆత్మహత్య నివారణ దినోత్సవంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వీసీ ఆచార్య గంగాధరరావు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆత్మహత్యల నివారణకు యువతలో ఇటువంటి అవగాహన కార్యక్రమాలు దోహదపడతాయని, యువతలో మరింత మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. సైకాలజీ విభాగం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ నెల 10వ తేదీ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ విభాగాలకు వెళ్లి సుమారు 300 మంది విద్యార్థులకు, వారి ద్వారా 1,300 మంది విద్యార్థులకు సైకాలజికల్‌గా ఫస్ట్ ఎయిడ్ చేసి జీవితంపై ఆశలను చిగురింపజేయడాన్ని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో సైకాలజీ విభాగాధిపతి ఆచార్య జి.చెన్నారెడ్డి, ఆచార్య టి.డి.విమల, ఎస్.అనురాధ, ఆర్.ప్రమీలారాణి, కె.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఏపాసికాన్- 2025లో జీఎంసీ పీజీ విద్యార్థుల ప్రతిభ



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల పీజీ విద్యార్థులు ఏపాసికాన్ 2025 రాష్ట్ర స్థాయి సదస్సులో నిర్వహించిన క్విజ్ పోటీలో రన్నరప్ స్థానాన్ని సాధించి కళాశాలకు గౌరవం, గుర్తింపు తెచ్చిపెట్టారు. ఈ బృందంలో డాక్టర్ లోహిత, డాక్టర్ కుసుమ వెంకట రాహుల్ రెడ్డి, డాక్టర్ పరిటాల లక్ష్మీ ప్రసన్న, డాక్టర్ సనికొమ్ము మణి భరగవ్ రెడ్డి ఉన్నారు. ప్రతిభ కనబర్చిన వైద్య విద్యార్థులను గుంటూరు జీజీహెచ్ శస్త్ర చికిత్స విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ వై.కిరణ్ కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.గోవింద్ నాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.నాగ సంతోష్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వినయ్ కుమార్ అభినందించారు. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ ప్రతిభ కనబర్చిన వైద్య విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

పెళ్లి చేయాలంటూ టవర్ ఎక్కి.. హల్‌చల్

తెనాలిరూరల్: మద్యం మత్తులో సెల్ టవర్ ఎక్కి ఓ యువకుడు హల్‌చల్ చేశాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పాండురంగపేటకు చెందిన అశోక్ గతంలో బొబ్బిలి ప్రాంతం నుంచి తెనాలి వచ్చి తాపీ పనులకు వెళుతుంటాడు. ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ, సహజీవనం చేస్తున్నాడు. స్థానికంగా మరో బాలికను ప్రేమించానని ఆమెతో పెళ్లి చేయాలని కోరుతూ సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో సెల్ టవర్ ఎక్కి నానా హడావిడి చేశాడు. మద్యం మత్తులో ఉన్న అశోక్ ఎంత మంది నచ్చజెప్పినా ఒంటిగంట వరకు టవర్ దిగలేదు. చివరికి త్రీ టౌన్ పోలీసులు రంగప్రవేశం చేయడంతో టవర్ దిగివచ్చిన అశోక్ కు స్థానికులు దేహశుద్ధి చేశారు. పోలీసులు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ తరలించి, విచారణ చేపట్టారు.

నేడు 'అన్నదాత పోరు'కు తరలిరావాలి



ఏర్పాట్లపై చర్చిస్తున్న వైఎస్సార్‌సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: రైతు సమస్యలకు పరిష్కారం, ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను అడ్డుకునేందుకు వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు మంగళవారం తలపెట్టిన 'అన్నదాత పోరు' కార్యక్రమంలో నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులను కలుపుకుని తెనాలి పట్టణానికి తరలిరావాలని పొన్నూరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ కోరారు. తెనాలిలో చేపట్టే అన్నదాత పోరు ఏర్పాట్లను సోమవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ ఉదయం 8 గంటలకు అందరూ తెనాలి పట్టణం దేవీ చౌక్‌లోని ఏ1 కన్వెన్షన్ వద్దకు చేరుకోవాలని, అక్కడి నుంచి ప్రదర్శనగా ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి అధికారులకు రైతు సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.శ్యామల, పార్టీ రాష్ట్ర నాయకురాలు నందమూరి లక్ష్మీపార్వతి పాల్గొననున్నారని తెలిపారు. రైతుకు అండగా నిలిచే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

'అన్నదాత పోరు' విజయవంతం చేయండి

ప్రత్తిపాడు: రైతులకు ఎల్లప్పుడూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని పెదనందిపాడు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు షేక్ ఖాశింపీరా అన్నారు. ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై రైతులకు బాసటగా నిలిచేందుకు ఈ నెల 9వ తేదీన వైఎస్సార్‌సీపీ అన్నదాత పోరు కార్యక్రమానికి పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం మండల కేంద్రం పెదనందిపాడులో పార్టీ నాయకులు అన్నదాత పోరు పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఖాశింపీరా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు సకాలంలో యూరియాను సరిపడినంత అందుబాటులో ఉంచడంలో ఘోరంగా విఫలమయ్యిందన్నారు. ఇప్పటికే వేల ఎకరాల్లో మాగాణి సాగు చేసిన వందల మంది రైతులు యూరియా కోసం దిక్కులు చూస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో రైతాంగానికి వైఎస్సార్‌సీపీ అన్నదాత పోరుతో అండగా నిలుస్తుందని తెలిపారు. మంగళవారం గుంటూరులోని కలెక్టర్ కార్యాలయం ఎదురునున్న ధర్నా చౌక్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఆర్డీవోకు వినతిపత్రం అందించడం జరుగుతుందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు, రైతులు హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



'అన్నదాత పోరు' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దళారుల చేతుల్లోకి యూరియా



పెదకాకాని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న సీపీఐ నాయకులు

పెదకాకాని: రైతులకు అందుబాటులో ఉండాల్సిన యూరియా దళారుల చేతుల్లోకి చేరిందని సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి కోటా మాల్యాద్రి ఆరోపించారు. సీపీఐ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రమైన పెదకాకాని తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పొన్నూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా హాజరైన సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డిలు మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో సహకార సొసైటీలు, రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా అమ్మకాల పట్ల రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, వచ్చిన ఎరువులను కొంతమంది దళారులు ఎక్కువ మొత్తంలో తీసుకెళ్లి సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. రైతులకు కావాల్సిన యూరియా కట్టలు అరకొరగా మాత్రమే అందుతున్నాయన్నారు. రైతులు ఒక యూరియా కట్ట కోసం రోజంతా క్యూలైన్‌లో నిరీక్షించవలసిన పరిస్థితులు నెలకొన్నాయని, అలా నిలబడినా ఒక కట్ట కూడా అందడం లేదన్నారు. దీంతో రైతులు నిరాశతో వెనుతిరిగి వెళ్లిపోతున్నారన్నారు. ఐదు, 10 ఎకరాలు విస్తీర్ణం ఉన్న రైతుకు ఒక్క కట్ట మాత్రమే ఇస్తుండటంతో ఆ ఒక్క కట్టను మేము ఏం చేసుకోవాలని రైతులు ప్రశ్నిస్తున్నారన్నారు. ప్రస్తుతం రైతులు సాగుచేసిన పత్తి, వరి, మొక్కజొన్న, కూరగాయలు పంటలతో పాటు ఉద్యాన పంటలైన మామిడి, జామ తదితర పంటలకు రెండవసారి ఎరువులు వేయవలసిన అవసరం ఉందన్నారు. ఆ ఎరువులలో తప్పనిసరిగా యూరియా కలపాలని రైతులు చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కేతినేని అగస్టీన్, రామిశెట్టి శ్రీనివాసరావు, ప్రసాదు, విజయలక్ష్మి, గోపి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేళాంగిణి మాత జన్మదినోత్సవం

తెనాలిరూరల్: వేళాంగిణి మేరీ మాత జన్మదినోత్సవాన్ని మండలంలోని అంగలకుదురులో ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం గ్రామంలోని ఆర్‌సీఎం చర్చి వద్ద వితంతువులు, పేదలకు బియ్యం, కూరగాయలు, గుడ్లు పంపిణీ చేశారు. చర్చి గురువులు ఉపదేశకులు, విశ్వాసులు పాల్గొన్నారు.

యూరియా కొరత.. అన్నదాత వ్యథ

- పరపతి ఉన్నోడికే యూరియా కట్టలు
- యథేచ్ఛగా బ్లాక్ మార్కెట్‌కు తరలింపు
- ఆందోళన చెందుతున్న రైతులు
- జీడీసీఎంఎస్ ద్వారా అందని ఎరువులు



మూసి ఉన్న నారాకోడూరులోని జీడీసీఎంఎస్ పాయింట్

పొన్నూరు: వర్షాలతో నష్టాల్లో ఉన్న రైతులకు యూరియా కష్టాలు ఎక్కువయ్యాయి. క్షేత్రస్థాయిలో యూరియా దొరక్క రైతులు ఆందోళన చెందుతున్నారు. కేటాయింపులు జరుగుతున్నా.. రైతులకు మాత్రం చేరడం లేదని వాపోతున్నారు. దీంతో యూరియా బస్తాలు బ్లాక్ మార్కెట్‌కు తరలివెళుతున్నాయన్న ఆరోపణలకు బలం చేకూరుస్తున్నాయి. వేకువజాము నుంచే సొసైటీలు, మార్కెట్ యార్డుల వద్ద గంటల తరబడి వేచి ఉన్నా ఒక్క బస్తా యూరియా కూడా లభించని దుస్థితి పొన్నూరులో నెలకొంది. పరపతి ఉన్నోడికే యూరియా కట్టలు అందుతున్నాయని, సామాన్యులను ముప్పతిప్పలు పెడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో 28 వేల ఎకరాల్లో

పొన్నూరు మండలంలో 28 వేల ఎకరాల్లో వరి సాగవుతోంది. 22 ఆర్ఎస్‌కేలు ఉండగా ఒక్కో ఆర్ఎస్‌కేకు 20 మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సి ఉంది. సుమారు 3127 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయిందని అధికారులు చెబుతున్నారు. యూరియా కొరత ఉందని, అధికారులు ముందస్తుగానే సమాచారం ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో లారీల్లో వచ్చిన అరకొర యూరియాపై పచ్చ నేతల పెత్తనం చెలామణి అవుతోంది. దీంతో సామాన్య రైతులకు యూరియా అందక సొసైటీలు, సహకార సంఘాలు, మార్కెట్ యార్డుల వద్ద పడిగాపులు కాస్తూ అవస్థలు పడుతున్నారు. శనివారం పొన్నూరు మార్కెట్ యార్డులో యూరియా కోసం రైతులు పడరాని పాట్లు పడ్డారు. బందోబస్తు నడుమ యూరియా పంపిణీ జరిగింది. రైతులను కట్టడి చేసేందుకు ఆ సొసైటీకి యూరియా వచ్చింది.. అక్కడికి వెళ్లండి అంటూ అసత్యపు మాటలతో రైతాంగాన్ని అవస్థలకు గురిచేశారు.

పచ్చ నేతల పెత్తనం

ప్రైవేటు డీలర్లు, ప్రాథమిక సహకార సంఘాలు ఇలా అన్ని చోట్లా రైతు ఆధార్ నెంబరును ఈ పోస్ యంత్రాల్లో నమోదు చేసి పాస్ బుక్ ఆధారంగా వారి వేలిముద్రలు తీసుకుని యూరియా, ఇతర ఎరువులను విక్రయించాల్సి ఉంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు యూరియా విక్రయాల్లో రైతు పాస్ బుక్, కౌలు రైతు కార్డుతో సంబంధం లేకుండానే ఆధార్ ప్రామాణికంగా యూరియా అందిస్తున్నట్లు తెలిసింది. దీంతో సరైన రైతుకు యూరియా అందకుండా పక్కదారి పడుతోంది. పేపరుపై పేర్లు రాసుకుని లారీల కొద్దీ యూరియాను విక్రయించేస్తుండటంతో యూరియా రైతుకు చేరకుండా బ్లాక్ మార్కెట్‌కు యథేచ్ఛగా తరలివెళ్లుతున్నారు.

కరెంటు తీసి.. కట్టలు పక్కదారి పట్టించి

మండలంలోని ఓ సొసైటీలో రాత్రి వేళలో వచ్చిన లారీలోని యూరియా బస్తాలు పక్కదారి పట్టినట్లు సమాచారం. దిగుమతి సమయంలో కరెంటు తీసి యూరియా బస్తాలు దారి మళ్లించినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. లారీలో వచ్చిన యూరియా ఎందుకు తగ్గిందని సొసైటీ అధికారులను రైతులు ప్రశ్నిస్తే వారి నుంచి ఎలాంటి సమాధానం రాలేదని తెలిపారు.

పక్కదారి పడుతున్న యూరియా

చేబ్రోలు: అన్నదాతలకు ఖరీఫ్ సాగులో అవసరమైన ఎరువులు అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. చేబ్రోలు మండల పరిధిలోని 13 గ్రామాల్లో 17 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. మండలంలో సుమారు 15 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. మరో ఐదు వేల ఎకరాల్లో మెట్ట, కూరగాయ పంటలు సాగు అవుతున్నాయి. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు మాగాణిలో సాగులో ఉన్న వరి పొలాలు నీట మునిగి దెబ్బతిన్నాయి. మొక్కలు కోలుకోవటానికి యూరియా, కాంప్లెక్స్ ఎరువులను పిచికారీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో

మండల పరిధిలోని గ్రామాల్లో అరకొరగా వచ్చిన యూరియా అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో పక్కదారి పడుతున్నాయి. స్థానిక వ్యవసాయ శాఖ సిబ్బంది స్థానిక నేతలతో కలిసి ఇష్టారాజ్యంగా యూరియాను పంపిణీ చేస్తూ నేతల ఇళ్లకు దిగుమతి చేస్తున్నారు. వీరనాయకునిపాలెం, శేకూరు తదితర ప్రాంతాల్లో రైతు సేవా కేంద్రాలకు వచ్చిన యూరియాను అధికార పార్టీ నేతల ఇళ్ల వద్దనే దించి అక్కడ నుంచి అరకొరగా కొంతమంది టీడీపీ కార్యకర్తలకు మాత్రమే యూరియాను అందించటం విమర్శలకు దారి తీస్తుంది.

జీడీసీఎంఎస్ ద్వారా అందని ఎరువులు

చేబ్రోలు, నారాకోడూరు గ్రామాల్లోని జీడీసీఎంఎస్‌లకు యూరియా, డీఏపీలను అధికారులు పుష్కలంగా సరఫరా చేస్తున్నారు. దిగుమతి అయిన తరువాత కంప్యూటర్‌లో నెంబరు నమోదు కాలేదని ఒకటి రెండు రోజులు జాప్యం చేసి తరువాత యూరియా అయిపోయిందని చెబుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. జీడీసీఎంఎస్ పాయింట్‌ల వద్ద కొంత మంది దళారులు సిండికేటుగా ఏర్పడి యూరియాకు ఉన్న డిమాండ్‌ను తమకు అనుకూలంగా మలుచుకొని జేబులు నింపుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

మండల పరిధిలోని నారాకోడూరు, చేబ్రోలు గ్రామాల్లోని జీడీసీఎంఎస్ పాయింట్‌ల వద్ద వ్యవసాయ శాఖ సిబ్బంది ద్వారా యూరియాను సరఫరా చేస్తాం. మండలంలో ఇప్పటి వరకు 1,200 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశాం. అధిక ధరలకు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. రెండు రోజుల్లో మండల పరిధిలోని అన్ని రైతు సేవా కేంద్రాలకు యూరియా, డీఏపీలను అందజేస్తాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– ఏడీఏ రామకోటేశ్వరి

మద్యం షాపు పక్కన జీడీసీఎంఎస్ పాయింట్

చేబ్రోలులోని జీడీసీఎంఎస్ పాయింట్ మద్యం షాపు పక్కన ఏర్పాటు చేయటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎరువుల కోసం వచ్చే రైతులకు మందుబాబులతో సమస్యలు ఏర్పడుతున్నాయి. వాహనాల రాకపోకలకు అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

అధికారుల పర్యవేక్షణ కరువు

మండలంలో యూరియా కోసం రైతులు అవస్థలు పడుతుంటే వాటిని నివారించాల్సిన మండల వ్యవసాయ శాఖాధికారుల పర్యవేక్షణ కరువైంది. బ్లాక్ మార్కెట్‌లో యూరియా రూ.450కు, డీఏపీ రూ.1,450కు విక్రయిస్తున్నారు. బస్తాకు రూ.100–150 అధికంగా తీసుకుంటున్నారు. అధిక ధరలకు కొనుగోలు చేయటానికి కూడా అందుబాటులో లేదు. ఎరువులు పక్కదారి పట్టడం, అధిక ధరలకు విక్రయిస్తున్నప్పటికి సంబంధిత అధికారులు స్పందించకపోవటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. న్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

సైబర్ సెక్యూరిటీపై అధ్యాపకులకు శిక్షణ



సిస్కో సంస్థ ఆసియా హెడ్ ఇషాందర్‌సింగ్‌ను సత్కరిస్తున్న ఏపీఎస్ఎస్‌డీసీ ఈడీ అనీల్‌కుమార్

పెదకాకాని: నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలాజికల్ విశ్వవిద్యాలయంలో ఆంధ్రప్రదేశ్‌లోని సాంకేతిక అధ్యాపకులకు సైబర్ సెక్యూరిటీ నెట్‌వర్క్ అంశాలపై సోమవారం శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సిస్కో సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 8 నుంచి 12వ తేదీ వరకూ ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ తరగతులను సిస్కో సంస్థ సౌత్ ఆసియా హెడ్ ఇషాందర్ సింగ్, ఏపీఎస్ఎస్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.అనీల్‌కుమార్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిస్కో సంస్థ సౌత్ ఆసియా హెడ్ ఇషాందర్ సింగ్ మాట్లాడుతూ డిజిటల్ దాడుల నుంచి వ్యక్తులను, వ్యాపారాలను, ప్రభుత్వ సంస్థలను కాపాడటంలో సైబర్ భద్రత చాలా ముఖ్యమైనదన్నారు. ఆర్థిక లావాదేవీలను సైబర్ సెక్యూరిటీ సురక్షితం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వీవీఐటీయూ రిజిస్ట్రార్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, ఎఫ్ఏఎస్ఎస్‌డీసీ జనరల్ మేనేజర్ జి.కిషోర్ కుమార్, సీమన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ డైరెక్టర్ డాక్టర్ రావెల నవీన్, ప్రోగ్రామ్ సంధానకర్త డాక్టర్ పుట్ట నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యతతో సమాజాభివృద్ధి

సీఎల్‌పీటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ నాదెండ్ల రామారావు



పోటీలలో విజేతలతో ఉపాధ్యాయులు తదితరులు

గుంటూరు రూరల్: చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లోని నేషనల్ సర్వీస్ స్కీమ్ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని జొన్నలగడ్డ జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం అక్షరాస్యత ప్రాముఖ్యతను తెలియజేసే విధంగా పలు పోటీలను నిర్వహించారు. అక్షరాస్యత మనుషుల వ్యక్తిత్వ వికాసానికి, సమాజ అభివృద్ధికి, దేశ ప్రగతికి పునాదిగా నిలుస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించి, అక్షరాస్యత విలువలను అవగాహన చేయడం లక్ష్యంగా వివిధ పోటీలు నిర్వహించారు. లిట్రసీ ఫర్ మ్యూచువల్ అండర్‌స్టాండింగ్ అండ్ పీస్ అనే అంశంపై వ్యాసరచన పోటీలు, ఇంపార్టెన్స్ ఆఫ్ రీడింగ్ రైటింగ్ ఎడ్యుకేషన్ ఫర్ బెటర్ సొసైటీ అనే అంశంపై వక్తృత్వ పోటీలు, ఇంపాక్ట్ ఆఫ్ లిట్రసీ ఆన్ సొసైటీ అనే అంశంపై వన్ మినిట్ టాక్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్స్ ప్రొఫెసర్ కేఎస్ రజనీకాంత్, డాక్టర్ జి.నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యర్థాలతో కాలువలు.. విజృంభిస్తున్న దోమలు



చెత్త, వ్యర్థాలతో నిండిన కాలువ

పొన్నూరు: పట్టణంలోని వైష్ణవి నగర్‌లో కాలువలు చెత్త వ్యర్థాలతో నిండి ఉన్నాయి. దీంతో మురుగు పారుదల లేక స్తంభించిపోయింది. దీని వలన దుర్వాసనతో పాటు దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. అధికారులకు సమస్యపై ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. రోజుల తరబడి వ్యర్థాలు తొలగించక కాలువలు అధ్వానంగా ఉన్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పిల్లల్లో స్వీయ అభివృద్ధికి తోడ్పాటు అందివ్వాలి


జిల్లా మిషన్ కో–ఆర్డినేటర్ శ్రీవాణి

తెనాలిటౌన్: పిల్లల్లో స్వీయ అభివృద్ధికి తోడ్పాటును అందివ్వాలని జిల్లా మిషన్ కో–ఆర్డినేటర్ డి.శ్రీవాణి పిలుపునిచ్చారు. స్థానిక బోసురోడ్డులోని అంబేడ్కర్ జూనియర్ కళాశాలలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మిషన్ శక్తి డీహెచ్‌ఈడబ్ల్యువో సంకల్ప కార్యక్రమంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జరుగుతున్న శిక్షణ తరగతులకు సోమవారం జిల్లా మిషన్ కో–ఆర్డినేటర్ శ్రీవాణి హాజరయ్యే మాట్లాడారు. బాల్య వివాహాల నిర్మూలన, మహిళల విద్య, వైద్యం, సంక్షేమం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఈ నెల 2వ తేదీ నుంచి 12వ తేదీ వరకు శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో పి.విజయగౌరి వెల్లడించారు. కార్యక్రమంలో డీవీసీ లీగల్ కౌన్సిలర్ కె.పద్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.సౌజన్య, యామిని, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళ పోలీసులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కృషి అసామాన్యం

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి అసామాన్యమని విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస బాబు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో సోమవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసబాబు మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితచరిత్రను వివరించారు. ఫార్మసీ నిపుణులకు మన దేశం లోను, ఇతర దేశాల లోనూ ఉత్తమ ఉపాధి అవకాశాలు ఉన్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదన రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, కళాశాల ఫార్మా డీ డైరెక్టర్ పి.సీతారామయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, సి.హెచ్.ప్రసాద రావు, డాక్టర్ వి.జవహర్ బాబు, జి.ఇందిరా ప్రియదర్శిని, జి.పూర్ణిమ, విద్యార్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కృషి, పట్టుదలతోనే విజయాల సాధన



నగరంపాలెం: విజయం ఒక్క రోజులో రాదని, క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన వల్లే సాధ్యమవుతుందని చైతన్య ప్యాకేజెస్ ఎండీ తులసి యోగీష్‌చంద్ర అన్నారు. అమరావతిరోడ్డు హిందూ కాలేజీ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాల విద్యార్థులు ఇటీవల ఏఎన్‌యూ ప్రకటించిన రెండో సంవత్సరం నాలుగో సెమిస్టర్ ఎంబీఏ, ఎంబీఏ హాస్పటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో నూరు శాతం ఉత్తీర్ణత శాతం సాధించారు. ఈ మేరకు మొదటి మూడు స్థానాలు పొందిన విద్యార్థులకు లాస్‌లో పనిచేస్తున్న మొహమ్మద్ పాషా, రూబీ నషీర్‌మొహమ్మద్‌లు ప్రోత్సాహక నగదు బహుమతులు అందించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ రమణ తెలిపారు. ఈ సందర్భంగా తులసి యోగీష్‌చంద్ర మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన అవార్డులు కృషికి ప్రతిఫలమని అన్నారు. ఇది ఒక ఆరంభమని, నిజమైన విజయమనేది విద్యార్థులు పొందే స్థానాల్లో, సమాజానికి అందించే సేవల్లో ప్రతిఫలిస్తుందని చెప్పారు.

యూరియా సమస్యను వెంటనే పరిష్కరించాలి

నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి రామిశెట్టి ఆదేశ్వరరావు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

ప్రత్తిపాడు: యూరియా సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రామిశెట్టి ఆదేశ్వరరావు అన్నారు. రైతులు ఎదుర్కొంటున్న యూరియా సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో సీపీఐ నాయకులు ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ కార్యదర్శి ఆదేశ్వరరావు పార్టీ నాయకులతో కలిసి ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్ సుజాతను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రామిశెట్టి ఆదేశ్వరరావు మాట్లాడుతూ యూరియా కొరత రైతులను వెంటాడుతుందన్నారు. డిమాండ్‌కు సరిపడా స్టాక్ క్షేత్ర స్థాయిలో అందుబాటులో లేకపోవడంతో కర్షకులు నానా అగచాట్లు పడుతున్నారని మండిపడ్డారు. స్టాక్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు నో స్టాక్ అంటారోనని రైతులు సొసైటీల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే అదనుగా కొందరు వ్యాపారస్తులు యూరియాను బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కౌలు రైతు సంఘం కార్యదర్శి పి.జగన్నాథం, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఎస్.అంజిబాబు, మండల కార్యదర్శి ఎం.అంకమ్మరావు, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి మేడా తాతారావు, గోపిరెడ్డి నాగిరెడ్డి, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు సిద్ధి రవి, పసుపులేటి వీరయ్య, రైతులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలువలు నిర్మించాలి

తెనాలిఅర్బన్: 3వ వార్డు సిద్ధార్థ కాలనీలో మురుగు కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నా మని.. వాటిని నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కోరారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ డీఈ శ్రీనివాసరావు ప్రజల నుంచి వినతిపత్రాలు సేకరించారు.